
సాక్షి
జోగులాంబ గద్వాల

7

ఆదివారం । 30 । మార్చి । 2025



ట్రైన్ ఇంజన్ వెలికితీత

ఎస్ఎల్‌బీసీ సొరంగంలో సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.

వివరాలు 8లో ▸



గరిష్టం/కనిష్టం
40.8 /22.6

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత, ఉక్కపోత పెరుగుతుంది. వడగాల్పులు వీస్తాయి.

విశ్వావసు నామ శుభాకాంక్షలు

'వి'శాల విశ్వంలో అందరూ..**వి**
'శ్వా' సముతో ధైర్యంగా జీవి**స్తూ**
'వ'సుధైక కుటుంబంలో భాగ**మవుతూ**
'సు'గుణాల సంపదలను పం**చుతూ**
అరమరికలు లేని సంసారము**న**
షడ్రుచులతో కష్టసుఖాలను
సమరీతిన భావించే శక్తి అంది**ంచాలని**
సర్వాంగ సుందరంగా తయా**రై**
విశ్వకాంతులను పంచాలని వస్తోన్న
'విశ్వావసు' నూతన వత్సరానికి
స్వాగతం... శుభస్వాగతం...



– ఇల్లూరి వెంకట్రామయ్య శెట్టి రిటైర్డు తెలుగు ఉపాధ్యాయుడు, అలంపూర్

షడ్రుచుల ఉగాది

క్రోధీకి వందనం.. ఆశల విశ్వావసు నామకు ఆహ్వానం

- తెలుగు సంస్కృతికి ప్రతీక ఈ పండుగ
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు, పంచాంగ శ్రవణానికి ఏర్పాట్లు

తెలుగు సంస్కృతి, సంప్రదాయాల్లో

కాలానికి ఒక ప్రమాణం ఉంది. కాలాన్ని లెక్కించడానికి నిర్దిష్ట ప్రమాణాలు ఉన్నాయి. అందులో భాగంగానే నెలలకు, సంవత్సరాలకు పేర్లను నిర్దేశించారు. చైత్రం నుంచి ప్రారంభమయ్యే నెలలు ఫాల్గుణంతో ముగిస్తాయి. కొత్త పూత, కొత్త కాత, కొత్త రుచులతో నూతన సంవత్సరం ఆరంభమవుతూ కొంగొత్త ఆలోచనలకు తెరతీస్తుంది. ద్వాపర యుగంలో తన అవతారాన్ని శ్రీకృష్ణుడు చాలించగా కలియుగం ప్రారంభమయ్యే సమయంగా దీన్ని యుగాదిగా పరిగణించారనే వాదన ఉంది. యుగాది కాలక్రమంలో ఉగాదిగా వాడుకలోకి వచ్చింది.

– గద్వాలటౌన్



తెలుగుజాతికి ప్రత్యేకం

ఉగాది పర్వదినం తెలుగుజాతికి మాత్రమే ప్రత్యేకం. ఉగాది రోజున ఒంటికి పసుపు కలిపిన సున్ని పిండితో నలుగు పెట్టుకొని తలంటు స్నానం చేస్తారు. కొత్త దుస్తులు ధరిస్తారు. షడ్రుచుల పచ్చడి సేవిస్తారు. పచ్చడిలో పులుపు (ఆమ్లం), తీపి (మధురం), వగరు (కషాయం), చేదు (పిత్తం), కారం (కటువు), ఉప్పు (లవణం) గుణాలతో కూడిన వేప పువ్వు, లేత మామిడి కాయ, బెల్లం, చింతపండు, ఉప్పు, కారంతో ఉగాది పచ్చడి తయారు చేస్తారు.

భవిష్యత్తుపై అప్రమత్తత.. పంచాంగం

ఈ పండుగ రోజున సాయంత్రం వేళ ఆలయాల్లో, గ్రామకూడలిలో పంచాంగ పఠనం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. పంచాంగం పూర్వ కాలంనుంచి ఒక శాస్త్రంగా భావిస్తూ వస్తున్నారు. గ్రామ పురోహితుడు హాజరై గ్రామ పెద్దలు, పుర ప్రముఖుల మధ్య పంచాంగం వివరాలను చదివి వినిపిస్తారు. పంచాంగం రానున్న ఏడాది కాలంలో వ్యక్తుల వ్యక్తిగత ఆదాయ, వ్యయాలు, పోకడలతో పాటు దేశప్రాంత సామాజిక పరిస్థితులు, వాతావరణం వంటి విషయాల్లోనూ అప్రమత్తం చేస్తుంది. వర్షాలు, కరవు కాటకాలు, అరిష్టాల గురించి ఇందులో వివరిస్తారు. నమ్మకాన్ని బట్టి ఈ వివరాలను విశ్వసిస్తారు. తిథి, వార, నక్షత్ర, యోగ, కరణం అనే ఐదు అంశాలతో కూడిన పంచాంగ పఠనం వింటే సంపద, ఆయుష్షు, పాపపరిహారం, రోగాలు తొలగడం, చేసే ప్రయత్నాలు ఫలించడం వంటి ఐదు ప్రయోజనాలు చేకూరుతాయని చెబుతారు.

ఆకట్టుకునే కవి సమ్మేళనం

పంచాంగ పఠనం తర్వాత నిర్వహించే కవి సమ్మేళనం ఆకట్టుకునేలా ఉంటుంది. **'హితేన సహితం సాహిత్యం' ఆ**ంటారు. **మేలుచేసేదే సాహిత్యం అని అర్థం**. వసంత**రుతువు కావడంతో లేత చిగుళ్లు** తిన్న **కోయిలలు మాధుర్యంతో కూసే** కూత **కవిలో కొత్త ఆలోచనలు కలిగిస్తుం**ది. ఈ **సమ్మేళనాల్లో ఔత్సాహిక కవులు** జన**హితం కోరుతూ** రచించిన కవితలను షడ్రుచులతోపాటు మాతృభాషపై మాధుర్యాన్ని జోడించి ఇందులో చదివి వినిపిస్తారు. ఇలాంటి కవి సమ్మేళనాలకు చిన్నారులను తీసుకెళ్లడం వల్ల వారికి మాతృభాషపై మరింత అవగాహన పెరిగే వీలుంటుంది. కవితా రచనప్రక్రియపై అవగాహన పెరుగుతుంది. ఇతర భాషల పట్ల మోజుతో ఉన్నవారికి సైతం మాతృభాషపై ఆసక్తిని కలిగిస్తుంది. కవితల రూపంలో తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను ముందు తరానికి పరిచయం చేయొచ్చు.

తెలుగు అజంత భాష

ప్రపంచ భాషల్లో తెలుగు మాధుర్యమైంది. ఎందుకంటే తెలుగులో ప్రతి పదం చివర అచ్చుతో ముగుస్తుంది. అచ్చుతో పదాలు ముగిసే భాష కాబట్టి అజంతభాష అనే పేరువచ్చింది. తెలుగుభాష మాధుర్యాన్ని చాటడానికి కవి సమ్మేళనం ఒక చక్కని వేదిక.

మనిషికి, ప్రకృతికి సంబంధం

చలికాలంలో మనిషి శరీరంపై కాలం తీరిన చర్మం పొరలుగా రాలిపోతుంది. వెంట్రుకలు కూడా అలాగే రాలిపోతుంటాయి. ప్రకృతిలో కూడా హేమంతరుతువు (చలికాలం ప్రారంభం)లో చెట్ల ఆకులు ఎండిపోతుంటాయి. శిశిరుతువు (చలికాలం ముగింపు)లో కొత్త చిగుళ్లు వేస్తుంటాయి. ఇలా ఒకే కాలం మనిషికి, ప్రకృతికి సంబంధాన్ని కలిపింది.

అంతటా పండుగ సందడి



గద్వాలలో సందడిగా మారిన మార్కెట్ ప్రాంతం

గద్వాలటౌన్: జిల్లా వ్యాప్తంగా ఉగాది సందడి కొట్టొచ్చినట్లు కనిపించింది. ఆదివారం పండగను జరుపుకోనుండటంతో జిల్లా వ్యాప్తంగా సందడి నెలకొంది. చుట్టు ప్రక్కల గ్రామాల ప్రజలు శనివారం గద్వాలకు వచ్చి పండగ వస్తువులు కొనుగోలు చేశారు. దీంతో గద్వాల పాతబస్టాండ్, రథశాల, కూరగాయల మార్కెట్, గాంధీచౌక్ తదితర ప్రాంతాలన్నీ కొనుగోలుదారులతో కిక్కిరిశాయి. గద్వాలతో పాటు అయిజ, శాంతినగర్, అలంపూర్ పట్టణాలలో సైతం ఉగాది హడావుడి కనిపించింది. ఉదయం మందకొడిగా సాగిన విక్రయాలు సాయంత్రం ఒక్కసారిగా ఊపందుకోవడంతో వ్యాపారులు హర్షం వ్యక్తం చేశారు. గద్వాలలో మామిడి కాయాలు, పచ్చి ఇస్తరాకులు, బంతిపూలు, టెంకాయల కొనుగోళ్లకు డిమాండ్ నెలకొంది. మార్కెట్‌తో పాటు ప్రధాన చౌరస్తాలలో పూల విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేసి అమ్మకాలు జరిపారు. పూలు, పండ్లు, కూరగాయల ధరలు కొండెక్కి కూర్చున్నా కొనుగోలు దారులు ఏమాత్రం రాజీ పడలేదు. అన్ని మార్కెట్లు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. మామిడి తోరణాలు పెద్దమొత్తంలో తీసుకొచ్చి అమ్మకాలు జరిపారు.

ఆలయాల ముస్తాబు

ఉగాదిని పురస్కరించుకొని స్థానికంగా ఉన్న ఆలయాలలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ముఖ్యంగా జిల్లా కేంద్రంలో సుంకులమ్మ, ఈదమ్మ ఆలయాల వద్ద భక్తులు నైవేద్యాలు సమర్పిస్తారు. ఇక్కడ వేల సంఖ్యలో కోళ్లను బలిస్తారు. అందుకుగాను ఆలయ నిర్వహకులు, ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. మండల కేంద్రాలతో పాటు జిల్లా కేంద్రంలోని మార్కండేయస్వామి ఆలయం, అహోబిల మఠం, శ్రీకన్యకా పరమేశ్వరి ఆలయం, నది అగ్రహారంలోని ఆలయాల దగ్గర పంచాంగం శ్రవణం నిర్వహించనున్నారు. ముఖ్యంగా జిల్లాలో ప్రసిద్ధ పుణ్య క్షేత్రాలైన అలంపూర్, బీచుపల్లి, మల్దకల్, పాంగుంట, చింతరేవుల తదితర ఆలయాలలో పంచాంగ శ్రవణం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాలలో ఉన్న ఆలయ నిర్వాహకులు భక్తులకు ఇబ్బందులు కలగకుండా తగిన ఏర్పాట్లు చేశారు.

న్యూస్‌రీల్

'ఉపాధి' కూలీలకు అధిక వేతనం వచ్చేలా చూడాలి



ఎర్రవల్లి: ఉపాధి హామీ పథకంలో కూలీలతో సరైన కొలతల ప్రకారం పనులను చేయించి అధిక వేతనం వచ్చేలా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ నర్సింగరావు అధికారులకు సూచించారు. శనివారం మండలంలోని తిమ్మాపురం గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధి కూలీలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..రోజు రోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతల నేపథ్యంలో ఉపాధి కూలీలు తగు జాగ్రత్తలు పాటించాలని, పనులు జరుగుతున్న ప్రదేశంలో కనీస వసతులు కల్పించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఉపాధి పనిలో మహిళ సమాఖ్య సంఘం సభ్యులు కూడా పాల్గొని వివిధ శాఖలకు ఉపయోగపడే పనులను పూర్తిచేసి పథకాన్ని సద్వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అబ్దుల్ సయ్యద్ ఖాన్, ఏపీఎం శివజ్యోతి, పంచాయతీ కార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డి, టిఏ ప్రవీన్, తదితరులు పాల్గొన్నారు.

పురాతన బావి కబ్జాపై నిరసన



గద్వాలటౌన్: సంస్థానాధీశుల కాలం నాటి పురాతన బావులను పునరుద్ధరించలేని పాలకులు, అధికార యంత్రాంగం.. కనీసం వాటి పరిరక్షణకు చర్యలు తీసుకోలేకపోవడం దారుణమని బీజేపీ నాయకులు ధ్వజమెత్తారు. పురాతన కొత్తబావిని పునరుద్ధరించడంతో పాటు ఆక్రమించుకున్న మున్సిపల్ మాజీ చైర్మన్ వేణుగోపాల్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ శనివారం బీజేపీ నిరసన దీక్ష చేపట్టింది. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామంజనేయులు, మాజీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి మాట్లాడుతూ.. పురాతన బావి కబ్జాపై ప్రజా సంఘాలు, అఖిలపక్ష నాయకులు ఆందోళనలు చేస్తున్న ఎమ్మెల్యే స్పందించకపోవడం ఏమిటని ప్రశ్నించారు. పూడ్చిన బావిలో మట్టి తొలగించడానికి మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకుంటే, వారిపై అధికార పార్టీ నేత బెదిరింపులకు పాల్పడ్డారని ఆరోపించారు. అనుమతులు లేకుండా సుమారు రెండు వందల టిప్పర్ల మట్టిని తరలించి బావిని పూడ్చిన సంబంధిత అధికారులు పట్టనట్లుగా వ్యవహరించారని ఆరోపించారు. దీక్ష శిబిరంలో బీజేపీ నాయకులు బండల వెంకట్రాములు, జయశ్రీ, కేకే రెడ్డి, దేవదాసు, చిత్తారికిరణ్, నర్సింహా, మాలీంఇసాక్, కృష్ణ, మదుగౌడ్, వాసు, శంకర్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్

అచ్చంపేట రూరల్: విద్యతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని.. బీసీలు తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించాలని రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ కోరారు. శనివారం అచ్చంపేట పట్టణంలోని మహేంద్రనగర్ కాలనీలో బుడుబుక్కల కులస్తులతో ఆయన సమావేశమై వారి జీవన స్థితిగతులను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అణగారిన వర్గాలకు చెందిన కొన్ని జాతుల వారు వృత్తిపరంగా ఉన్నత స్థాయిలో ఉన్నా.. తమ కులం పేరు బయట చెప్పేందుకు సిగ్గుపడే స్థితిలో ఉన్నారన్నారు. బీసీలలోని కొన్ని కులాల్లో పేర్లు బయటకు చెప్పుకోలేనంత అభ్యంతరకరంగా ఉండటంతోనే కుల పేర్ల మార్పిడీపై ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరిస్తున్నట్లు చెప్పారు. పేరు మార్పిడీపై వారి సలహాలను స్వీకరించారు.

18వ శతాబ్దం నుంచి పంచాంగ శ్రవణం

గద్వాల: ఉగాది పండుగను.. పంచాంగ శ్రవణాన్ని దాదాపు నాలుగు తరాలుగా ఆ కుటుంబసభ్యులు వైభవంగా నిర్వహిస్తూ వస్తున్నారు. వారే.. గద్వాలకు చెందిన బోరవెల్లి కుటుంబసభ్యులు. జిల్లా కేంద్రంలోని సంతాన వేణుగోపాలస్వామి ఆలయాన్ని 18వ శతాబ్దంలో భీమ్‌రెడ్డి, నాంచారమ్మ దంపతులు నిర్మించారు. భీమ్‌రెడ్డి సోదరుడైన రామన్న గద్వాల సంస్థానానికి దత్తతగా వెళ్లి రాంభూపాలుడు–2 పేరుతో మహారాజుగా పట్టాభిషిక్తుడయ్యాడు. అక్కడి నుంచి ప్రతి ఉగాది పండుగ సాయంత్రం సంతాన వేణుగోపాలస్వామి ఆలయంలో పంచాంగ శ్రవణం వైభవంగా నిర్వహిస్తూ వస్తున్నారు. ఈ ఆలయానికి బోరవెల్లి కేశవాచార్యులు నుంచి మొదలై 19వ శతాబ్దంలో వారి కుమారుడు బోరవెల్లి ప్రకాశమాచార్యులు, వారి కుమారులు బోరవెల్లి రాఘవాచార్యులు, మరియు బోరవెల్లి పవన్‌కుమార్ సంప్రదాయాన్ని అలాగే కొనసాగిస్తూ భక్తులకు పంచాంగ శ్రవణం చేస్తూ వస్తున్నారు.



గద్వాలలోని సంతాన వేణుగోపాలస్వామి ఆలయంలో పంచాంగ శ్రవణం వినిపిస్తున్న అర్చకులు బోరవెల్లి రాఘవాచార్యులు

నాలుగు తరాలుగా..



సంతాన వేణుగోపాలస్వామి దేవాలయంలో ప్రధాన అర్చకులుగా మా తాత బోరవెల్లి కేశవాచార్యులు కొనసాగారు. తదనంతరం మా తండ్రి బోరవెల్లి ప్రకాషమాచార్యులు, వారి తర్వాత నాతో పాటు మా సోదరుడు రాఘవాచార్యులు ఆలయంలో భక్తులకు ఉగాది పంచాంగ శ్రవణం ద్వారా ఉగాది విశిష్టతను వివరిస్తూ వస్తున్నాం. ఈ ఏడాది వచ్చే ఉగాదిని శ్రీ విశ్వవసునామ సంవత్సరం అంటారు. ఉగాది పండుగ నాడు పంచాంగ శ్రవణం ద్వారా నూతన సంవత్సరంలో గ్రహగతులు ఎలా ఉన్నాయి, దేశంలో పంటల స్థితిగతులు, వర్షాలు ఎలా కురుస్తాయి, దేశంలోని యుద్ధాలు వంటివి జరిగే అవకాశాలు ఉన్నాయి అనే అంశాలను వివరిస్తాం. వ్యక్తిగత గోచార ఫలితాలు, గ్రహగతులు వంటి విషయాలు తెలుపుతాం.

– బోరవెల్లి పవన్‌కుమార్ ఆచార్యులు, గద్వాల

54 ఏళ్లుగా జ్యోతిష్యం.. పంచాంగం

మానవపాడు: మానవపాడు మండలం అమరవాయి గ్రామానికి చెందిన మేళ్ల చెరువు రేవతీనాథ్‌శర్మ 54 ఏళ్లుగా జ్యోతిష్యం.. పంచాంగ శ్రవణం వినిపిస్తూ వస్తున్నారు. రాష్ట్రం నుంచే గాక ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల నుంచి ప్రజలు పంచాంగం, జ్యోతిష్యం కోసం ఇక్కడికి వస్తుంటారు. మానవపాడు మండలంలోని చెన్నిపాడు గ్రామానికి చెందిన ఆఫీస్ నాగిరెడ్డితోపాటు దత్తాత్రేయశాస్త్రీ, విజయవాడ నాగేశ్వరశాస్త్రీ వద్ద రేవతీనాథ్‌శర్మ పంచాంగం, జ్యోతిష్యం నేర్చుకున్నారు. నాటి నుంచి ప్రజలకు జ్యోతిష్యం, పంచాంగం వివరిస్తూ వస్తున్నారు. అలాగే, ఉత్తమ అర్చకుడిగా ఉమ్మడి మహబూబ్‌నగర్ కలెక్టర్ శ్రీదేవి చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు.



అవార్డు పొందగా 'సాక్షి'లో ప్రచురితమైన క్లిప్పింగ్ (ఫైల్)

రైతులు జాగ్రత్తగా ఉండాలి



చాలా మంది ప్రజలు మాపై నమ్మకంతో అమరవాయి గ్రామానికి వచ్చి జ్యోతిష్యం, పంచాంగం చెప్పించుకుంటారు. మా గురువుల నుంచి నేర్చుకున్న జ్యోతిష్యం, పంచాంగ శ్రవణాన్ని ఏళ్లుగా ప్రజలకు వివరిస్తూ వస్తున్నా. ఇక.. ఈ విశ్వావసు నామ సంవత్సరం విషయానికి వస్తే ప్రేమ వివాహాలు ఎక్కువగా జరుగుతాయి. రెండు తుమ్ముల వాన, ఒక తుమ్ము గాలి విస్తాయి. రైతులు జాగ్రత్తగా ఉండాలి. ఒకటి రెండు సార్లు ఆలోచించి పంట సాగు చేయాలి. పంట చేతికి వచ్చే సమయంలో ధర రాదు.. ధర వచ్చినప్పుడు పంట చేతిలో ఉండదు. నలుపు, తెలుపు, ఎరుపు పంటలకు ఎక్కువగా ప్రాధాన్యత ఉంటుంది. అగ్ని, వాహన ప్రమాదాలు ఎక్కువగా అవుతాయి.

– మేళ్ల చెరువు రేవతీనాథ్‌శర్మ, అమరవాయి, మానవపాడు మండలం

దాశరథి ఆత్మలో తెలంగాణ

- జైలులో నిర్బంధించినా రచనలు ఆపలేదు
- ప్రముఖ కవి, గాయకుడు, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్



నినాదాలు చేస్తున్న ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

వనపర్తిటౌన్: నా తెలంగాణ.. కోటి రతనాల వీణ అని వెలుగెత్తి చాటిన దాశరథిని జైలులో నిర్బంధించినా గర్జించే రచనలు చేశారని ప్రముఖ కవి, గాయకుడు, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ అన్నారు. శనివారం రాత్రి ఓ ఫంక్షన్‌హాల్‌లో దాశరథి కృష్ణమాచార్య శతజయంతి వేడుకలను సాహితీ కళావేదిక ఆధ్వర్యంలో నిర్వహించగా.. కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. దాశరథి ఆత్మలో తెలంగాణ భాగమైందని కొనియాడారు. ఆయన రచనలు బీఆర్ఎస్ ఆవిర్భావంతో గోడలపై నినాదాలుగా వెలుగులోకి వచ్చాయని పేర్కొన్నారు. మహనీయులకు జన్మనిచ్చిన గడ్డ.. సాహిత్య శిఖరం సురవరం ప్రతాపరెడ్డి పుట్టిన గడ్డ వనపర్తి అని ప్రశంసించారు. సంక్లిష్ట సమాజంలో నిలబడి నిజాం పోకడలను ఎత్తిచూపారని గుర్తుచేశారు. రైతాంగ పోరాట ఉద్యమం వెలుగులోకి రావడంతో తెలంగాణ గురించి ప్రపంచానికి తెలిసిందన్నారు. బీఆర్ఎస్ పాలన పాలమూరును పచ్చని పంటల కల్పవల్లిగా తీర్చిదిద్దిందని వివరించారు. నిరంజన్‌రెడ్డి మళ్లీ వస్తేనే వనపర్తిలో అభివృద్ధి జరుగుతుందని చెప్పారు. మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ ఉన్నంత కాలం చరిత్రలో దాశరథి పేరు చిరస్థాయిగా ఉంటుందని, అనతి కాలంలోనే ప్రభావితమైన రచనలు చేసిన కవిగా దాశరథి తెలంగాణలో గుర్తుండిపోయారని చెప్పారు. కేసీఆర్ నాయకత్వంతో దాశరథికి నిజమైన నివాళులర్పించినట్లు గుర్తు చేశారు. ఈ సందర్భంగా పలువురు కవులను దేశపతి శ్రీనివాస్, నిరంజన్‌రెడ్డి సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, మున్సిపల్ మాజీ చైర్మన్ పలుస రమేష్‌గౌడ్, సాహితీ కళావేదిక అధ్యక్షుడు పలుస శంకర్‌గౌడ్, కవులు, వీరయ్య, నాగవరం బలరాం, భైరోజు చంద్రశేఖర్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్, జిల్లా అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్ పాల్గొన్నారు.



హాజరైన కవులు, రచయితలు

ఆలయాల్లో ప్రముఖుల ప్రత్యేక పూజలు



అలంపూర్‌లో ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ మిథాలి మధుస్మిత



బీచుపల్లిలో భక్తులతో కిక్కిరిసిన ఆంజనేయస్వామి ఆలయం,



దర్శనం కోసం భక్తుల క్యూ..

అలంపూర్/ఎర్రవల్లి: దక్షిణ కాశీ అలంపూర్ క్షేత్ర ఆలయాలను తెలంగాణ – ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన ఆదాయపన్ను శాఖ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ మిథాలి మధుస్మిత శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఈఓ పురేందర్‌కుమార్, ఆలయ అధికారులు ఆమెకు ఘన స్వాగతం పలికారు. ముందుగా జోగుళాంబ అమ్మవారి, బాలబ్రహ్మేశ్వర స్వామి వారి ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు వారికి తీర్థ ప్రసాదాలను అందజేసి ఆశీర్వచనం పలికారు.

భక్తిశ్రద్ధలతో చండీహోమం

అమావాస్యను పురస్కరించుకొని జోగుళాంబ అమ్మవారి ఆలయంలో శనివారం చండీ హోమాలు నిర్వహించగా 178 మంది భక్తులు పాల్గొన్నారు.

భక్తులతో కిక్కిరిసిన బీచుపల్లి పుణ్యక్షేత్రం

ఎర్రవల్లి: అమావాస్యను పురస్కరించుకొని బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని పలు ఆలయాలు శనివారం భక్తులతో రద్దీగా మారాయి. అభయాంనేయస్వామికి ఆలయ ప్రధాన అర్చకులు అభిషేకం తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన భక్తులు శివాలయం, కోదండరామస్వామి, సరస్వతీదేవితో పాటు అభయాంజనేయస్వామి ఆలయాలను దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ పాలకమండలి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు.

ఉమ్మడి జిల్లా ప్రజలకు, డాక్టర్లకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు

SVS హాస్పిటల్

SVS GROUP OF INSTITUTIONS

MAHABUBNAGAR వారి

శ్రీ విశ్వావసునామ ఉగాది శుభాకాంక్షలు

ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఉచిత వైద్య శిబిరం

తేది: 31-3-2025 (సోమవారం) నుండి తేది: 8-4-2025 (మంగళవారం) వరకు

జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, కాన్పులు మరియు స్త్రీల వ్యాధులు, చిన్న పిల్లలకు సంబంధించిన వ్యాధులు, కంటి సమస్యలు, చెవి, ముక్కు, గొంతు సమస్యలు, ఊపిరితిత్తుల వ్యాధులు, మానసిక వ్యాధులు మరియు కీళ్లు, ఎముకలకు సంబంధించిన సమస్యలున్న వారికి ఉచిత బెడ్ సౌకర్యం కలిగించి రోగ నిర్ధారణ పరీక్షలు ఉచితంగా చేయబడును.

గమనిక: ఆరోగ్యశ్రీ వర్తించనివారికి శస్త్రచికిత్సలలో 50% రాయితీ ఇవ్వబడును.

వివరాలకు: 6303444232 , 7893888529

విశ్వావసు - ఉగాది



వసంత ఋతువు వచ్చిందిఉగాది
పండుగను తెచ్చింది
ప్రకృతి కాంత పరవళ్ల ఉగాది
పండుగ పచ్చళ్ల
కోకిల కూతల కుహు
కుహులు పల్లె సీమల పచ్చదనాలు
పల్లెపల్లెలో పచ్చదనం ప్రపంచానికది కొత్తదనం
విశ్వావసు వచ్చేసింది విశ్వాసాన్ని నింపేసింది.
రుచి నిచ్చే ఉప్పుకారం నేర్పాలి మనకుపకారం
నోరూరించే తీపి, పులుపు జీవితానికది ఒక మలుపు
కమ్మనైన మామిడి వగరు తుంచాలి దుష్టుల పొగరు
వేప పూతల చేదు తొలగించును మనలో కీడు..

– ఆవుల సైదులు, తెలుగు ఉపాధ్యాయుడు, నాగర్‌కర్నూల్ జిల్లా

కదిలి రావమ్మా.. వసంతమా



విత్తులో విశ్వాసాన్ని విపత్తును ఎదు
ర్కొనే ధైర్యాన్ని
రైతన్నలకు ప్రసాదించా కదిలి రావమ్మా వసంతమా...
మమ్మల్ని కడగండ్ల పాలు చేయకుండా
వడగండ్లను దూరం చేసి.. రైతును రాజును చేయ
నాగలిని నలుదిక్కుల దివిటిని చేయ..
ప్రకృతి కాంతవై కర్షక యుగ రథసారథివై
కదలి రావమ్మావ సంతమా..
ఓడిన బతుకులను గెలిపించే గీతమై..
కడలిలో చిక్కిన రైతుల బతుకునావని
చేర్చే చుక్కానివై ..
మొండి మానును చిగురింపజేసే తొలకరి చినుకువై ..
నల్లని కోయిలమ్మతో జతకట్టి తియ్యని రాగాలు దీయ ..
తొలి సంధ్య కిరణమై కదిలి రావమ్మా వసంతమా..

– ఉప్పరి తిరుమలేష్, అమరచింత, వనపర్తి జిల్లా

వినసొంపైన కోయిల స్వరం..



విరబూసిన మావిపూతల మాధుర్యం
మామిడితోరణమై కళకళలాడెను
గుమ్మం నేటితో తెలుగింటి వారి నూతన
యుగం ప్రారంభం
చైత్రమాసపు వసంత ఋతువుకు ఆహ్వానం
విశ్వావసునామ సంవత్సరానికి సుస్వాగతం
ఉగాది పర్వదినం.. షడ్రుచుల సమ్మేళనం
కష్టసుఖాల సంయమనం
ఉగాది పచ్చడి పంచుకుంటూ పరవశం
చిన్న,పెద్ద ఆత్మీయ ఆలింగనం
చిందెసెను పెదవిపై చిరునవ్వుల నృత్యం
పంచాంగ శ్రవణంకై ఉత్సాహం
సకలజనుల ఆశయాల అడుగులు ఆరంభం

– యూ.సరిత, పెద్దదగడ, చిన్నంబావి (వనపర్తి)

విశ్వశాంతికి విశ్వావసు



పేదరికపు అమాసలు పోనీ
ఉద్యమాలవోలె ఉద్యోగాలు రానీ
హింస ఎరుగని పక్షులోలే ఆడకూ
తుర్లు ఎగురని
డ్రగ్స్,బెట్టింగ్స్ భూతం మింగని యువతం డనీ
రైతన్నల ముఖాల్లో నవ్వుల ఇత్తులు మొలవనీ
గుడి, చర్చి, మసీద్
సామరస్య గీతాలు పాడే కోకిలలు అవ్వనీ
విశ్వ శాంతికి విశ్వావసు శ్రీకారం చుట్టనీ.

– అతినారపు హరిశంకర్, లట్టుపల్లి, బిజినేపల్లి మండలం

షడ్రుచుల సమ్మేళనం



చైత్రమాసం తీసుకొచ్చింది
కోకిల గానం
కొమ్మల్లో చిగురు తొడిగింది
వసంత గీతం
గుమ్మాలనలంకరించింది మామిడి తోరణం
మళ్లీ పురుడోసుకుంది నూతన వత్సరా
కొత్తబట్టలతో పిండివంటలతో జరిగే సంబరం
మమతానురాగాల మురిపెం తాకేను అంబరం
అందరినీ అలరించేను పంచాంగ శ్రవణం
ఇది షడ్రుచులను అందించే గొప్ప సమ్మేళనం
విశ్వావసు నామ ఉగాదికిదియే ఘన స్వాగతం

– మండికారి బాలాజీ, ఎల్‌ఎల్‌ఎం, అచ్చంపేట,

ఉగాది వత్సర మొచ్చె.. శుభాల నెన్నో తెచ్చె



తెలుగువారందరికి సంబరంబులిక హెచ్చె!
మామిడిపూత కాత.. కోకిలమ్మల కూత
అందాల ప్రకృతమ్మ.. చిందించు ఇలకంత!
వేప మామిడి పూతలు.. కారం బెల్లం రుచులు
ఆరురుచుల పచ్చడి.. ఇచ్చును ఆరోగ్యాలు!
మందు మాకులు లేవు.. చికెన్ మటనులు లేవు
తెలుగు వత్సరాదిన.. సంతసమె యిడినావు!
అభ్యంగన స్నానాలు.. నవ వలువలు దారణలు
కొంగ్రొత్త ఆశలతో.. పంచాంగ శ్రవణాదులు!
సోమకుడిని సంహరించె.. వేదాలను బ్రహ్మకిచ్చె
మత్స్యావతారాన హరి..పురాణ ప్రసిద్ధిని గాంచె!

– డాక్టర్ పోల సాయిజ్యోతి, (స్కూల్‌అసిస్టెంట్, తెలుగు, చెన్నంపల్లి), నాగర్‌కర్నూల్ జిల్లా

గురాశల ఉగాది



మంచు తెరలను
తొలగించుకొన్న సూర్యుడు
ఇప్పుడిప్పుడే నిప్పుపూలు
రాలుస్తుంటే,
పాత బట్టలను వదిలిన వృక్షజాతి
చిగురాకులు, కుసుమాలతో
స్వాగతమంటుంది
చలికి పొడిబారిన దేహాలు
ఉగాది రాకతో ఉజ్వలంగా జ్వలిస్తున్నాయి
మధుర స్వప్నాలలో విహరించే మనిషికి
షడ్రుచుల సంగమమైన ఉగాది పచ్చడి
గీతోపదేశంలా యదార్థాన్ని బోధిస్తుంది
పాతకు పాతరేస్తూ, నవతకు నాంది పలుకుతూ
ఎన్నో ఆశలతో దూసుకొస్తున్న ఓ విశ్వావసు
విశ్వమంతా నీ కీర్తి వెలుగొందాలని
విశ్వసిస్తున్నాము.

– డాక్టర్ వేముల శేఖరయ్య, తెలుగు ఉపన్యాసకులు, అనంతవరం (బల్మూరు)

ఒక శకం ముగిసి పోతోంది.. విశ్వానికి విశ్వాసం కలిగించేందుకు..



రండి! నూతన సంవత్సర సంబరం జరుపుకుందాం!
భూతాపం తగ్గించేందుకు కాసిని విత్తనాల్ని వెదజల్లి,
ఆకుపచ్చని వింజామరల్ని తయారు చేద్దాం!
నైతికత నశించి పోయింది...మానవత భ్రష్టు పట్టింది.
కొత్త తరానికైన..కొన్ని వేమన పద్యాలు నేర్పిద్దాం !
బడి భాషాంతా ఇంగ్లీషే నాయే,
ఇంటిలోనైనా తెలుగులో మాట్లాడుదాం!
తెలుగువారి సంస్కృతిని అలవర్చుకుందాం!
సత్య సనాతన ధర్మం వైపు దృష్టి సారించు!
నీ నుంచే మార్పు ప్రారంభించు!
రండి! నూతన సంవత్సర సంబరం జరుపుకుందాం!!

– కమలేకర్ శ్యామ్‌ప్రసాద్‌రావు, పాలమూరు

లోకో ట్రైన్ ఇంజన్ వెలికితీత

- ఎస్‌ఎల్‌బీసీలో ముమ్మరంగా సాగుతున్న సహాయక చర్యలు
- 36 రోజులుగా కొనసాగుతున్న అన్వేషణ

అచ్చంపేట: శ్రీశైలం ఎడమగట్టు కాల్వ(ఎస్‌ఎల్‌బీసీ) సొరంగంలో గత నెల 22న జరిగిన ఘటనలో ఎనిమిది మంది కార్మికులు చిక్కుకోగా సహాయక బృందాలు ఇద్దరి మృతదేహాలను వెలికితీశాయి. మిగిలిన ఆరుగురి ఆచూకీ కోసం 36 రోజులుగా తీవ్రంగా శ్రమిస్తున్నాయి. జీఎస్‌ఐ అధికారుల సూచనల మేరకు ప్రమాద ప్రదేశం నుంచి 30 మీటర్ల దూరంలో బారికేడ్లు ఏర్పాటు చేశారు. శనివారం సొరంగం ప్రమాద ప్రదేశంలో మట్టిలో కూరకుపోయిన లోకో ట్రైన్ క్యాబిన్లు, ఇంజన్‌ను వెలికితీసి బయటకు తీసుకొచ్చారు. సహాయక చర్యల్లో వేగం పెంచేందుకు డీ1, డీ2 ప్రాంతాల వరకు కన్వేయర్ బెల్టు పొడిగించేందుకు చర్యలు చేపడుతున్నారు. లోకో ట్రైన్ ఉన్న ప్రదేశంలో మట్టిని తొలగించి కార్మికుల జాడ కనుగొనేందుకు సహాయ సిబ్బంది క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. లోకో ట్రైన్ ఇంజన్ వెలికితీయడంపై ప్రత్యేక అధికారి శివశంకర్ సహాయక బృందాలను అభినందిస్తూ ఇదే స్ఫూర్తితో సహాయక చర్యలు కొనసాగించాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన 12 రకాల సహాయక బృందాల్లోని 600 మంది సమన్వయంతో పూర్తిస్థాయిలో పనులు చేపడుతున్నారు. నిరంతరాయంగా వస్తున్న నీటి ఊటను బయటకు తరలించే ప్రక్రియ కొనసాగుతుంది. టీబీఎం భాగాలను థర్మల్ కట్టర్‌తో తొలగించి లోకో ట్రైన్‌లో బయటకు తరలిస్తున్నారు. టీబీఎం కూ రుకుపోయి ప్రమాదకరంగా ఉన్న 30 మీటర్లు వదిలేసి 185 మీటర్ల వరకు ఉన్న శిథిలాలను తొలగిస్తున్నారు. 4 ఎస్కవేటర్లు, 2 బాబ్ క్యాట్లతో మట్టిని తొలగిస్తూ కన్వేయర్ బెల్టు ద్వారా.. ప్రమాద ప్రదేశంలో కూలిన పెద్దపెద్ద బండరాళ్లను మినీ ఇటాచ్‌తో తొలగించి లోకో ట్రైన్ ద్వారా బయటకు తరలిస్తున్నారు.



సొరంగం నుంచి బయటకు తీసుకొచ్చిన లోకో ట్రైన్ ఇంజన్‌ను పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి శివశంకర్

నిర్దేశిత లక్ష్యంతో పని చేస్తున్నాం..

సొరంగంలో చిక్కుకున్న వారి జాడను గుర్తించేందుకు సహాయక చర్యలు వేగవంతం చేశామని.. రోజు నిర్దేశిత లక్ష్యంతో పని చేస్తున్నామని ప్రత్యేక అధికారి శివశంకర్ లోతేటి తెలిపారు. శనివారం జేపీ కంపెనీ కార్యాలయంలో ఆర్మీ అధికారి వికాస్‌సింగ్, మేనేజర్ డా.విజయ్‌కుమార్, సింగరేణి రెస్క్యూ జీఎం బైద్య, ఆర్డీఓ శ్రీనివాసులు, ఎన్డీఆర్ఎఫ్ కమాండెంట్ కిరణ్‌కుమార్, గిరిధర్‌రెడ్డి, రైల్వే అధికారి చంద్రం, జీఎస్‌ఐ అధికారి పంకజ్ తిరుగున్, హైడ్రా అధికారి నారాయణ, అన్వి రోబోటిక్ ప్రతినిధులు విజయ్, అక్షయ్, జేపీ కంపెనీ ప్రతినిధులు, బృందాల ఉన్నతాధికారులతో సహాయక చర్యలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..
సొరంగంలో మట్టిలో కూరకుపోయిన లోకో ట్రైన్ ఇంజన్‌ను వెలికితీశామని.. నాలుగు ఎస్కవేటర్లు, రెండు బాబ్ క్యాట్లు నిరంతరాయంగా మట్టిని తొలగిస్తూ కన్వేయర్ బెల్టు ద్వారా బయటకు తరలిస్తున్నట్లు చెప్పారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సహాయక చర్యలు కొనసాగిస్తున్నట్లు తెలిపారు.





సహాయ బృందాల ఉన్నతాధికారులతో సమావేశమైన ప్రత్యేకాధికారి, సహాయ బృందానికి సూచనలిస్తున్న ఉన్నతాధికారి

హత్యకు దారితీసిన వివాహేతర సంబంధం

- వ్యక్తి అనుమానాస్పద మృతి కేసును ఛేదించిన పోలీసులు
- నిందితుడికి రిమాండ్



హత్యకేసు వివరాలు వెల్లడిస్తున్న సీఐ నాగార్జునగౌడ్

రాజాపూర్(బాలానగర్): వివాహేతర సంబంధం ఓ వ్యక్తి హత్యకు దారితీసింది. జడ్చర్ల రూరల్ సీఐ నాగార్జున గౌడ్ శనివారం బాలానగర్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. బాలానగర్‌కు చెందిన జహంగీర్ అదే గ్రామానికి చెందిన సక్రితో పదేళ్ల నుంచి వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. విషయం తెలుసుకున్న సక్రి భర్త సోమ్లా జహంగీర్‌ను పలుమార్లు మందలించాడు. అయితే తమ సంబంధానికి సోమ్లా అడ్డువస్తున్నాడని జహంగీర్‌ను హతమార్చాలని ఎనిమిదేళ్ల క్రితం ప్రయత్నించాడు. అప్పట్లో బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ కేసులో జహంగీర్ జైలుకు వెళ్లి వచ్చాడు. అయినప్పటికీ వివాహేతర సంబంధం కొనసాగిస్తుండటంతో సక్రి కుమారుడు సిద్దార్థ్ జహంగీర్‌ను ఎలాగైనా అంతమొందించాలని నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 26న సక్రి, జహంగీర్ మద్యం తీసుకుని గ్రామ సమీపంలోని బొందలగడ్డకు వెళ్లిన విషయాన్ని గమనించిన సిద్దార్థ్.. ఇంటి నుంచి కర్ర తీసుకుని వెళ్లాడు. పొదల్లో ఉన్న తల్లిని కర్రతో రెండు దెబ్బలు వేయడంతో ఆమె పారిపోయింది. అక్కడే ఉన్న జహంగీర్‌పై కర్రతో బాదడంతో స్పృహ కోల్పోయాడు. అక్కడే ఉన్న మద్యాన్ని జహంగీర్‌పై పోసి నిప్పుపెట్టి వెళ్లిపోయాడు. జహంగీర్ స్పృహలోకి వచ్చిన తర్వాత ఇంటికి వెళ్లి జరిగిన విషయాన్ని కుటుంబ సభ్యులకు చెప్పాడు. 27న రాత్రి జహంగీర్ నిద్రించిన చోటే మృతిచెందాడు. మృతుడి భార్య పిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసిన పోలీసులు.. పోస్టుమార్టంలో మృతుడి ఒంటిపై గాయాలు ఉన్న విషయంతో హత్యకేసుగా నమోదు చేసుకుని విచారణ చేపట్టారు. సక్రి కుమారుడు సిద్దార్థ్‌ను అదుపులోకి విచారణ చేయగా.. చేసిన నేరాన్ని ఒప్పుకోవడంతో శనివారం నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చగా రిమాండ్‌కు తరలించినట్లు సీఐ నాగార్జునగౌడ్ తెలిపారు. సమావేశంలో బాలానగర్ ఎస్‌ఐ లెనిన్‌గౌడ్, సిబ్బంది వెంకటయ్య ఉన్నారు.

మహిళ మెడలో నుంచి బంగారు గొలుసు చోరీ

నాగర్‌కర్నూల్ క్రైం: మహిళ మెడలో నుంచి గుర్తుతెలియని వ్యక్తులు బంగారు గొలుసు చోరీకి పాల్పడిన ఘటన నాగర్‌కర్నూల్ మండలం శ్రీపురంలో శనివారం చోటు చేసుకుంది. బాధితురాలి వివరాల మేరకు.. శ్రీపురం గ్రామానికి చెందిన పల్లవి కుటుంబ సభ్యులతో కలిసి ఇంటి ఆవరణలో నిద్రిస్తుండగా.. గుర్తుతెలియని వ్యక్తులు ఆమె మెడలో నుంచి 3 తులాల బంగారు గొలుసు చోరీ చేశారు. ఈ ఘటనకు సంబంధించి ఎస్‌ఐ గోవర్ధన్‌ను వివరణ కోరగా.. తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

జడ్చర్ల: పట్టణంలోని పాత బజార్‌కు చెందిన ఆనంద్ (52) చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. ఈ నెల 19న ఆనంద్ తన తల్లిని ద్విచక్ర వాహనంపై మహబూబ్‌నగర్‌లోని ఆస్పత్రికి తీసుకెళ్తుండగా.. ఎదురుగా వచ్చిన ఆటో ఢీకొట్టడంతో అతడు తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే చికిత్స కోసం ఏనుగొండ ఎస్వీఎస్ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య, కూతురు ఉన్నారు. మృతుడు ఒక్కడు సినిమాలో నటించి.. ఒక చిన్న డైలాగ్ మాట్లాడటంతో గుర్తింపు పొందాడు.

ఆహార ధాన్యాల ఉత్పత్తికి.. ఎరువుల యాజమాన్యం ముఖ్యం

పాడి-పంట

అధికారి సలహా: సక్రియనాయక్, జిల్లా వ్యవసాయాధికారి, గద్వాల

అలంపూర్: ఆహార ధాన్యాల ఉత్పత్తి సాధించడానికి తీసుకోవాల్సిన చర్యల్లో సమతుల, సమగ్ర ఎరువుల యాజమాన్యం ముఖ్యమైనది. పోషకాల సమతుల్యత, సమగ్ర ఎరువుల వాడకం పాటించక పోవడంతో ఆహార ధాన్యాల ఉత్పత్తి సమస్యగా మారుతోందని జిల్లా వ్యవసాయశాఖ అధికారి సక్రియ నాయక్ అన్నారు. రాబోయే రోజుల్లో దేశ జనాభాకు తగ్గట్టుగా 30వేల కోట్ల టన్నుల ఆహార ధాన్యాలు అవసరమవుతాయని.. ఇందుకోసం నాలుగున్నర కోట్ల టన్నుల ఎరువుల అవసరం ఉంటుందని నిపుణుల అంచనా. ఈ నేపథ్యంలో ఆహార ఉత్పత్తిలో సమతుల, సమగ్ర ఎరువుల యాజమాన్యం పాటించాల్సిన ఆవశ్యకత నెలకొందని వివరించారు.



పొలంలో వేయడానికి సిద్ధంగా ఉన్న ఎరువులు

సమతుల ఎరువులు : పైరుకు కావాల్సిన పోషకాలు ఎక్కువ.. తక్కువ కాకుండా అవసరమైన మేరకు సకాలంలో ఎరువులు అందించడాన్ని సమతుల ఎరువుల యాజమాన్యం అంటారు. దీనిపై అవగాహన లేకపోవడంతో నత్రజని వినియోగిస్తున్నారు. దీనివల్ల నేల ఫలదత తగ్గిపోవడం, చౌడుబారడం, పైర్లు చీడపీడలకు సులభంగా గురికావడం వంటి పరిణామాలు ఏర్పడతాయి.

సమగ్ర ఎరువులు: రసాయన, సేంద్రియ, జీవన ఎరువుల ద్వారా తగిన రీతిలో పైర్లకు పోషకాలు అందించడాన్ని సమగ్ర ఎరువుల వాడకంగా పేర్కొంటారు. పైరుకు సిఫార్సు చేసిన పోషక మోతాదులో మూడింట రెండు వంతులు రసాయన ఎరువుల ద్వారా ఒకవంతు సేంద్రియ, జీవన ఎరువుల ద్వారా అందించినప్పుడు దీర్ఘకాలం పాటు భూసారం, ఫలదత, నేల ఆరోగ్యం కాపాడుతూ.. అధిక దిగుబడి పొందవచ్చు. రసాయన ఎరువులతో ముఖ్య పోషకాలు, సేంద్రియ ఎరువులతో అన్ని పోషకాలు కొద్ది పరిమాణంలో లభ్యమవుతాయి. జీవన ఎరువులు గాలి నుంచి నత్రజని, నేల నుంచి భాస్వరం అందించడానికి దోహదపడతాయి.

చీడపీడలను అరికట్టడంలో పోషకాల పాత్ర: రసాయన ఎరువుల వాడకానికి చీడపీడల ఉధృతానికి ప్రత్యక్ష సంబంధం లేనప్పటికీ సమతుల, సమగ్ర ఎరువుల వాడకంతో పరోక్షంగా మొక్క చీడపీడలను నిలవరించి.. శక్తి పొందుతుందనడానికి ఎలాంటి సందేహం లేదు. ఎరువుల యాజమాన్య లోపం వల్ల ఈ సమస్య తీవ్ర రూపం దాల్చుతుంది.

నత్రజని: పంటకు నత్రజని అధికంగా వేసినప్పుడు మొక్క ఏపుగా పెరిగి శాఖీయో ఉత్పత్తి బాగా జరిగి ఆకులు, కాడలు బిరుసుతనం కోల్పోయి మెత్తగా తయారై పురుగులు తినడానికి అనువుగా ఉంటుంది. పురుగులు బాగా వృద్ధి చెంది ఆకులను మొక్క ఇతర భాగాలను తిని నష్టం కలిగిస్తుంది. సిఫార్సు చేయబడిన మోతాదుకు మించి నత్రజని వాడకూడదు. యూరియాను వేప పిండితో కలిపి వేయాలి. లేదా నిమిన్ వంటి వేప సంబంధిత వాటితో కలిపి వాడవచ్చు.

భాస్వరం: దీన్ని ప్రభావం చీడపీడల నివారణలో ప్రత్యేక్షంగా కనిపించకపోయినా సమతుల్యత రీత్యా పరోక్షంగా ప్రముఖ పాత్ర వహిస్తుంది. నత్రజని, భాస్వరం పూర్తిస్థాయిలో సమతుల్యంగా ఉన్నప్పుడు మొక్క రెండింటిని సమానంగా వినియోగించుకుంటుంది. మొక్క తొలిదశలో వేర్లు బాగా వృద్ధి చెందడానికి, నేల నుంచి పోషకాలను తీసుకొని మొక్క ఆరోగ్యంగా ఉండటానికి తోడ్పడుతుంది.

పోటాష్: చీడపీడల యాజమాన్యంలో పోటాష్ కీలక పాత్ర పోషిస్తుంది. పోటాష్ అధికంగా ఉండే మొక్కల కణజాలం తినడానికి పురుగులకు రుచించదు. వరి పైరులో చీడపీడలపై అధిక ప్రభావం చూపి సమర్థవంతంగా అరికడుతుంది. చెరుకు పైరులోనూ పురుగు ఉధృతి బాగా తగ్గుతుంది. టమాట, మిరప, వంకాయ, బంగాలదుంప వంటి కూరగాయాల పైర్లకు తగినంత పోటాష్ పోషకాన్ని అందించినప్పుడు పురుగుల తాకిడి తక్కువగా ఉంటుంది. పోటాషియం శాతం అధికంగా ఉండే మామిడి మొక్కల్లో తేనెమంచు పురుగు దాడి అతితక్కువగా ఉంటుంది.

సాక్షి క్లాసిఫైడ్స్

HOUSE FOR SALE

" independent House for Sale "184yds, 2BHK East Facing at Jedcharla M: 9886154400

SERVICES

BUSINESS OFFER

టెక్నికల్ అనాలిసిస్ వాలా సులభంగా ఇంట్రాడే, పోజిషనల్ స్టాక్స్ లో ఇన్వెస్ట్‌మెంట్. సంప్ర: 9885207852

DOCUMENT MISSING

గుర్తేటి బాలస్వామి తండ్రి లేట్ జి. వాసుదేవ్, వయస్సు:78 సం॥, ఇ.నం.4-10-20/B, రామ్‌నగర్ కాలనీ, మహబూబ్‌నగర్ టౌన్ మరియు జిల్లా గారికి చెందిన ప్లాటుకు సంబంధించిన ఒరిజినల్ డాక్యుమెంట్ నం: 1944/1984 అను డాక్యుమెంట్ తేది.20-03-2025 నాడు మహబూబ్‌నగర్ బస్టాండు నుండి మా ఇంటికి రామ్‌నగర్ వెళ్తుండగా ప్లాటు ఒరిజినల్ డాక్యుమెంట్ తప్పిపోవడం జరిగింది. ఇట్టి డాక్యుమెంట్ ఎవరికైనా దొరికినచో సంప్రదించండి: సెల్.నెం. 99850 72434.

గుర్తేటి బాలప్రకాష్ తండ్రి లేట్ జి. వాసుదేవ్, వయస్సు:67 సం॥, ఇ.నం. 4-10-20/B, రామ్‌నగర్ కాలనీ, మహబూబ్‌నగర్ టౌన్ మరియు జిల్లా గారికి చెందిన ప్లాటుకు సంబంధించిన ఒరిజినల్ డాక్యుమెంట్ నం: 1943/1984 అను డాక్యుమెంట్ తేది.20-03-2025 నాడు మహబూబ్‌నగర్ బస్టాండు నుండి మా ఇంటికి రామ్‌నగర్ వెళ్తుండగా ప్లాటు ఒరిజినల్ డాక్యుమెంట్ తప్పిపోవడం జరిగింది. ఇట్టి డాక్యుమెంట్ ఎవరికైనా దొరికినచో సంప్రదించండి: సెల్. నెం. 99850 72434.

సాక్షి భవిత విద్యార్థుల కోసం

HEALTH CARE

ORTHOPEDIC SURGEON

డా॥యస్.రవితేజ రెడ్డి, M.S., (ORTHO) (KMC మణిపాల్) ఎముకలు, నరములు, వెన్నెముక & కీళ్ళ మార్పిడి శస్త్ర చికిత్స నిపుణులు. శిరీష పాలీ క్లినిక్, అపోలో హాస్పిటల్ ప్రక్కన, 3వ లైన్, N.R.పేట, కర్నూలు. 08518 - 228666, 83412 98666.

WANTED

WANTED TEACHERS Upanishad International School Kosgi, Narayanpet(D) Ph: 7989-417-503; 799-33-91279

Hyd-రియల్ ఎస్టేట్ Co. కై మార్కెటింగ్ Exe కావలెను. కోకాపేట్, శంకరపల్లిలో విల్లాస్/ప్లాట్స్ సేల్స్‌కై జీ+కమీ+2వీలర్+రూం+భో ఫ్రీ. Age: 34, నె. లక్ష రూ. ఫ్రెష్/Exp. 74163 96781.

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని ఒకటికి పరిశీలించిన పిదప ప్రత్యుత్తరమివ్వాల్సిందిగా మా పాఠకులను కోరుతున్నాము. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధంలేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు - సాక్షి మేనేజర్









జెన్ ఏఐలో ఇంకా వెనుకబాటే..!


అత్యాధునిక సాంకేతికతను అందిపుచ్చుకుని ఉపయోగించుకోవడంలో భారతీయ పరిశ్రమలు, సంస్థల వెనుకడుగు

బోస్టన్ కన్సల్టెన్సీ గ్రూప్ (బీసీజీ) తాజా నివేదిక వెల్లడి

జెన్ ఏఐ ప్రయోజనాలను 80% డెవలపర్లు గుర్తించినా, ఉపయోగిస్తున్నది 39 శాతమే

భద్రతపై సందేహాలు, ఉద్యోగాలు పోతాయనే భయమే కారణమంటున్న నిపుణులు

సాక్షి, హైదరాబాద్: 'జనరేటివ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్'(జెన్ ఏఐ) వల్ల కలిగే ప్రయోజనాలను ఉపయోగించుకోవడంలో భారత పరిశ్రమలు, సంస్థలు వెనుకడుగు వేస్తున్నాయి. గ్లోబల్ ఐటీ పవర్‌హౌస్‌గా గుర్తింపు పొందడంతో పాటు టెక్నాలజీ ట్రేడ్‌లో 250 బిలియన్ డాలర్ల పరిశ్రమగా 50 లక్షల మంది ఐటీ నిపుణులతో విరాజిల్లుతున్న భారత ఐటీ పరిశ్రమ 'జెన్ ఏఐ'కీలక మలుపు వద్ద నిలిచింది. ప్రస్తుతం అంతర్జాతీయ స్థాయి అవుట్ సోర్సింగ్ రంగంలో భారత్ ఆధిపత్యం కొనసాగుతున్న దశలో ఎల్ఎల్ఎం ఫైన్ ట్యూనింగ్, క్లౌడ్ కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీ వంటి నైపుణ్యాల్లో యువతరం (నెక్స్ట్-జనరేషన్) '51 శాతం మేర స్కిల్డ్ టాలెంట్ గ్యాప్'ను ఎదుర్కొంటున్నట్టు తాజా అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ పరిస్థితుల వల్ల భవిష్యత్తులో కృత్రిమ మేథ ఏఐ సంబంధిత ఆవిష్కరణల్లో తమ ప్రాధాన్యతలను కోల్పోయే పరిస్థితులు ఏర్పడవచ్చుననే ఆందోళన భారత నిపుణుల్లో వ్యక్తమవుతోంది. 'జెన్ ఏఐ'వల్ల కలిగే ఉత్పాదకత వృద్ధి ప్రయోజనాలను 83 శాతం డెవలపర్లు గుర్తించినా, వారు దీనిని ఉపయోగిస్తున్నది 39 శాతమేనని, దానిని అనుసరిస్తూ, తమకు తగ్గట్టుగా వర్తింప చేసుకునే నవయువ డెవలపర్లు 31 శాతానికే పరిమితమవుతున్నట్టు బోస్టన్ కన్సల్టెన్సీ గ్రూప్ (బీసీజీ) తాజా అధ్యయనంలో తేలింది. ఈ సవాళ్లను సరైన పద్ధతుల్లో సమాధానాలు వెతుక్కోవడంతో పాటు వాటిని అధిగమించే దిశలో చర్యలు చేపట్టకపోతే గ్లోబల్ ఏఐ లీడర్లుగా ఉన్న యూఎస్ఏ, చైనాల కంటే వెనుకబడే ప్రమాదం ఉందని అధ్యయనం హెచ్చరించింది. ఈ రంగంలో మధ్యస్థ శక్తులుగా ఎదిగిన దక్షిణ కొరియా, జపాన్, సౌదీ ఆరేబియా కూడా పైస్థాయికి చేరుకునే ప్రయత్నాలు చురుగ్గా సాగిస్తున్న సమయంలో భారత్‌కు ఇది సవాళ్లతో కూడుకున్నదనే అభిప్రాయం వ్యక్తం చేసింది. ప్రస్తుత పరిస్థితులను అధిగమించి కృత నిశ్చయంతో ముందుకు సాగేందుకు అవసరమైన శిక్షణ కొరవడడం, ఈ అత్యాధునిక సాంకేతికతలను ఉపయోగిస్తున్న క్రమంలో ఎదురవుతున్న భద్రతాపరమైన సందేహాలు, జెన్ ఏఐ వంటి వాటితో ఉద్యోగాలు పోతాయనే భయం తదితర కారణాలతో వివిధ కంపెనీలు ఆచితూచి స్పందిస్తున్నాయని తెలిపింది. మారుతున్న సాంకేతికతలకు తగ్గట్టుగా ఐటీ సర్వీసుల్లో జెన్ ఏఐ వర్తింపును వేగవంతం చేయడం ద్వారా పైచేయి సాధించాలంటే భారత్ వివిధ చర్యలు చేపట్టాలని అధ్యయనం సూచించింది.



రెండేళ్లు గడుస్తున్నా వెనుకబాటే..

2022 చివర్లో ఏఐ, జెన్ ఏఐ అనేవి పరిశ్రమల్లో కీలక మార్పులకు శ్రీకారం చుట్టాయి. అయితే రెండేళ్లు గడుస్తున్నా జెన్ ఏఐను అందిపుచ్చుకుని, వర్తింపజేసుకునే విషయంలో అధిక శాతం పరిశ్రమలు వెనుకబడ్డాయి. ఇందుకు కారణం టెక్నాలజీ కాదని మానవ స్వభావం, ప్రవర్తనదేనని అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా ఉద్యోగులు మొదలు డెవలపర్లలో ఉద్యోగాలు కోల్పోతామనే భయం వెంటాడుతుండటమే ఇందుకు కారణమని చెబుతున్నారు. ఈ నేపథ్యంలోనే ఈ అధునాతన టూల్స్‌ను ఉద్యోగులు ఉపయోగించి మంచి ఫలితాలను సాధించేలా చేయడమనేది పెద్ద సవాల్‌గా మారుతోందని అంటున్నారు. ఈ సాంకేతికతను పూర్తిస్థాయిలో అమలు చేసే విషయంలో కస్టమర్ల నుంచి కూడా వ్యతిరేకత ఎదురవుతున్నట్టుగా కంపెనీలు పేర్కొంటున్నాయి.

భారత్ ఏం చేయాలంటే..

- వివిధ ప్రావీణ్యాలు, నైపుణ్యాల ఆధారిత శిక్షణా పద్ధతులు (ట్రెనింగ్ మోడళ్లు) చేపట్టాలి.
- ఏఐ, జెన్ ఏఐలు ఏ మేరకు ప్రభావితం చేస్తాయన్న దానిపై 'ప్రొఫిషియెన్సీ బేస్డ్ ట్రైనింగ్ మోడల్స్' తీసుకురావాలి.
- మేనేజ్‌మెంట్, వర్క్‌ఫోర్స్ తమ నైపుణ్యాలు పెంచుకునేందుకు ప్రోత్సాహకాలు అందించడంతో పాటు, ఉత్తమ శిక్షణ నిమిత్తం 'ఎగ్జిక్యూటివ్ స్పాన్సర్‌షిప్' చేపట్టాలి.
- భద్రతా పరమైన ఆందోళనలు, సమస్యలు అధిగమించేందుకు పరిశ్రమ క్లయింట్లతో దృఢమైన బంధాలు కొనసాగించేలా వ్యూహాలు రూపొందించుకోవాలి.

జనరేటివ్ ఏఐ అంటే..



జనరేటివ్ ఏఐ (జెన్ ఏఐ) అనేది యూజర్ కోరుకున్న కంటెంట్ లేదా విజ్ఞప్తికి తగ్గట్టుగా సాఫ్ట్‌వేర్ కోడ్‌ను రూపొందించుకుంటుంది. ముఖ్యంగా ట్రెనింగ్, ట్యూనింగ్, జనరేషన్ అనే మూడు దశలుగా పనిచేస్తుంది. టెక్స్ట్, ఇమేజేస్, ఆడియోల రూపంలో ఒరిజనల్ కంటెంట్‌ను తయారు చేయగలదు. అధునాతన మెషీన్ లెర్నింగ్ మోడళ్లు మరి ముఖ్యంగా డీప్ లెర్నింగ్ మోడళ్లపై ఆధారపడి ఈ టెక్నాలజీ పనిచేస్తుంది. ఇది మనుషుల మెదళ్ల మాదిరిగా నేర్చుకోవడం, నిర్ణయం తీసుకునే ప్రక్రియను వేగవంతం చేస్తుంది.

ఎవరు అడ్డుపడ్డా 'వక్ఫ్' సవరణ బిల్లు ఆగదు

దేశం కోసమే కఠిన నిర్ణయాలు: బండి



కరీంనగర్ టౌన్: భారత రాజ్యాంగానికి భవిష్యత్‌లో ఆర్ఎస్ఎస్ భావజాలంతోనే ముప్పు పొంచి ఉందంటూ మజ్లిస్ అధినేత అసదుద్దీన్ ఒవైసీ చేసిన వ్యాఖ్యలపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ మండిపడ్డారు. మజ్లిస్ పార్టీయే అసలైన దేశద్రోహ పార్టీ అని ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం కరీంనగర్‌లోని జిల్లా కోర్టు కాంప్లెక్స్‌లోని న్యాయవాదుల డిజిటల్ లైబ్రరీ కోసం బండి సంజయ్ రూ.15 లక్షలు మంజూరు చేశారు. న్యాయవాదుల కాన్ఫరెన్స్ హాల్ కోసం సీఎస్సార్ ఫండ్స్ నుంచి మరో రూ.50 లక్షల సాయం చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా న్యాయవాదులంతా బండి సంజయ్‌ను సన్మానించారు. అనంతరం సంజయ్ మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం జాతీయవాద భావజాలంతో పనిచేస్తోందన్నారు. వక్ఫ్ బోర్డు బిల్లుపై దేశవ్యాప్తంగా మద్దతు లభిస్తోందని చెప్పారు. ఒవైసీ సహా కుహనా లౌకిక వాదులు ఎంత అడ్డుకున్నా పార్లమెంట్‌లో త్వరలోనే వక్ఫ్ బోర్డు సవరణ బిల్లు ఆమోదం పొందుతుందని స్పష్టం చేశారు. దేశ శ్రేయస్సు కోసం మోదీ ప్రభుత్వం మరిన్ని కఠిన నిర్ణయాలు తీసుకునేందుకు సిద్ధంగా ఉందన్నారు.

రజతోత్సవాలపై బీఆర్ఎస్ ఫోకస్

- ఎర్రవల్లి నివాసంలో పార్టీ నేతలతో కేసీఆర్ వరుస భేటీలు
- క్షేత్రస్థాయిలో రాజకీయ పరిస్థితులు, ప్రభుత్వ పనితీరుపై ఆరా
- జన సమీకరణ, సభ ఏర్పాట్లపై 20కి పైగా ప్రత్యేక కమిటీలు
- ఏప్రిల్ 2న ఎల్కతుర్తిలో బహిరంగ సభా స్థలికి భూమి పూజ
- రెండో వారం నుంచి జిల్లాలవారీగా కేటీఆర్ పర్యటనలు



సాక్షి, హైదరాబాద్: పార్టీ రజతోత్సవ వేడుకల్లో భాగంగా ఏప్రిల్ 27న నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేయడంపై బీఆర్ఎస్ పార్టీ దృష్టి కేంద్రీకరించింది. పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ఎర్రవల్లి నివాసంలో పార్టీ ముఖ్య నేతలతో వరుస సమావేశాలు నిర్వహిస్తున్నారు. సభకు జన సమీకరణపై దిశానిర్దేశం చేస్తున్నారు. ఒక్కో నియోజకవర్గం నుంచి సభకు ఎంత మంది తరలివచ్చే అవకాశముందని ఆరా తీస్తున్నారు. మరోవైపు క్షేత్రస్థాయిలో నెలకొన్న రాజకీయ పరిస్థితులు, ప్రభుత్వ పనితీరుపై ప్రజలు స్పందిస్తున్న తీరును అడిగి తెలుసుకుంటున్నారు. ఇప్పటికే ఉమ్మడి నల్లగొండ, కరీంనగర్, వరంగల్ జిల్లాకు చెందిన ముఖ్య నేతలతో కేసీఆర్ సమావేశాలు నిర్వహించారు. బడ్జెట్ సమావేశాలపై పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావుకు ఎప్పటికప్పుడు కేసీఆర్ దిశానిర్దేశం చేస్తూ వచ్చారు. అదే సమయంలో పార్టీ ముఖ్యనేతలతో వరుస భేటీలు నిర్వహించారు. ఉత్తర తెలంగాణలో బీజేపీ అంతర్గతంగా నిర్వహిస్తున్న కార్యకలాపాలపై కేసీఆర్ ఆరా తీస్తున్నట్లు తెలిసింది. పార్టీ సంస్థాగత నిర్మాణం, ఏడాది పొడవునా నిర్వహించాల్సిన రజతోత్సవ వేడుకల తీరుతెన్నులపైనా నేతల అభిప్రాయాలు కోరుతున్నట్లు తెలిసింది.

సభ ఏర్పాట్లకు ప్రత్యేక కమిటీలు

హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో జరిగే బహిరంగ సభను ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న బీఆర్ఎస్ అధినేత.. సభ నిర్వహణలో పార్టీ ముఖ్య నేతలకు బాధ్యతలు అప్పగిస్తున్నారు. సభ నిర్వహణ కోసం 20కి పైగా కమిటీలు ఏర్పాటు చేయనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డితోపాటు ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన నేతలు సభా స్థలి ఎంపిక, రైతుల నుంచి నిరభ్యంతర పత్రాల సేకరణ, పోలీసుల అనుమతులకు దరఖాస్తులు తదితర పనుల్లో తలమునకలయ్యారు. హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే ఒడితెల సతీశ్‌కుమార్‌కు కూడా బాధ్యతలు అప్పగించారు. సుమారు 1,200 ఎకరాల్లో బహిరంగ సభ నిర్వహణ ఏర్పాట్లు జరగనుండగా, మైదానం చదును చేయడం, వేదిక నిర్మాణం తదితరాలకు సంబంధించి ఏప్రిల్ 2న భూమి పూజ చేస్తారు.

తెలంగాణ భవన్‌లో కేటీఆర్ సమీక్షలు

సభను విజయవంతం చేసేందుకు జిల్లాలవారీగా ఈ నెల 20న సన్నాహక భేటీలకు శ్రీకారం చుట్టిన కేటీఆర్.. ఇప్పటికే సూర్యాపేట, కరీంనగర్ జిల్లాల ముఖ్యనేతలతో సమావేశమయ్యారు. ఏప్రిల్ మొదటి వారంలో తెలంగాణ భవన్‌లో కేటీఆర్ అధ్యక్షతన పార్టీ అనుబంధ సంఘాల నాయకులతో వరుస సమావేశాలు జరుగనున్నాయి. పార్టీ జిల్లా అధ్యక్షులను కూడా ఈ సమావేశాల్లో భాగస్వాములను చేస్తారు. ఈ సమావేశాలు ముగిసిన తర్వాత ఏప్రిల్ రెండో వారంలో కేటీఆర్ జిల్లాలవారీగా రజతోత్సవ సభ సన్నాహక సమావేశాలు నిర్వహిస్తారు. కేటీఆర్ జిల్లా పర్యటనలకు సంబంధించిన షెడ్యూల్‌ను త్వరలో విడుదల చేస్తామని తెలంగాణ భవన్ వర్గాలు వెల్లడించాయి.



శనివారం కొడంగల్‌లో ప్రభుత్వం ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందులో పాల్గొన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

ప్రజావసరాలకు అనుగుణంగా లింకురోడ్లు

- హెచ్ఆర్‌డీసీఎల్ సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ నగరంలో ప్రజావసరాలకు అనుగుణంగా అనుసంధాన (లింక్) రోడ్ల నిర్మాణం చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రాజధాని నగరంతో పాటు హెచ్ఎండీఏ పరిధిలో హైదరాబాద్ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (హెచ్ఆర్‌డీసీఎల్) ఆధ్వర్యంలో చేపడుతున్న లింక్ రోడ్ల నిర్మాణం, విస్తరణపై ఐసీసీసీలో శనివారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా 49 రోడ్ల నిర్మాణం, విస్తరణపై సీఎం పలు సూచనలు చేశారు. వివిధ ప్రాంతాల మధ్య అనుసంధానం పెంచాలని, ప్రజలు ఎలాంటి అవాంతరాలు లేకుండా రాకపోకలు సాగించేందుకు వీలుగా రహదారుల నిర్మాణం చేపట్టాలని సీఎం ఆదేశించారు. వివిధ ప్రాంతాల్లో రహదారుల నిర్మాణం వల్ల ప్రయాణికుల ఇబ్బందులు తొలగిపోయి సమయం ఆదా అయ్యేలా ఉండాలని సూచించారు. ఇందుకోసం అదనపు భూసేకరణకు కొంత అధిక వ్యయమైనా వెనుకాడవద్దని స్పష్టం చేశారు.

బార్ అసోసియేషన్ కార్యదర్శిగా తెలకపల్లి వాసి



పసుపుల రాము

తెలకపల్లి: తెలంగాణ హైకోర్టు బార్ అసోసియేషన్ స్పోర్ట్స్, కల్చరల్ సెక్రెటరీగా పసుపుల రాము ఎన్నికయ్యారు. నాగర్‌కర్నూల్ జిల్లా తెలకపల్లికి చెందిన రాము 2015 నుంచి హైకోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్నారు. 2025 ఫిబ్రవరి వరకు హైకోర్ట్ ఏజీపీగా పనిచేశారు. జిల్లాకు చెందిన రాము హైకోర్టు అసోసియేషన్ కార్యదర్శిగా ఎన్నిక కావడంపై మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డితో పాటు గ్రామస్తులు అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

భూత్పూర్: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన శనివారం మండలంలోని తాటికొండ స్టేజీ వద్ద జరిగింది. ఎస్ఐ చంద్రశేఖర్ కథనం మేరకు.. మహబూబ్‌నగర్‌లోని టీడీగుట్టకు చెందిన ఎన్నం సత్తయ్య (61) ద్విచక్ర వాహనంపై శనివారం ఉదయం కందూరు రామలింగేశ్వరస్వామి ఆలయానికి బయలుదేరాడు. 11 గంటల ప్రాంతంలో తాటికొండ స్టేజీ వద్ద జాతీయ రహదారిపై వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన కారు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. కుమారుడు ఎన్నం మహేష్ ఫిర్యాదు మేరకు కారు డ్రైవర్ వీరారెడ్డిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

బైక్ ఢీకొని వృద్ధుడి మృతి

- మరొకరికి తీవ్రగాయాలు



మృతుడు రాజయ్య

ఎర్రవల్లి: జాతీయ రహదారిపై నడుచుకుంటూ వెళ్తున్న పాదచారుడిని బైక్ ఢీకొన్న ఘటనలో వృద్ధుడు అక్కడికక్కడే మృతి చెందగా, మరొకరు గాయాలపాలైన ఘటన శనివారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు.. గద్వాల మండలం గుంటిపల్లికి చెందిన రాజయ్య(60) కొండేరు నుంచి జాతీయ రహదారిపై నడుచుకుంటూ ఎర్రవల్లికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో పెట్రోల్ బంక్ సమీపంలో వెళ్తుండగా కొండేరుకు చెందిన దేవేందర్ బైక్‌పై ఎర్రవల్లి నుంచి రాంగ్‌రూట్‌లో వెళ్లి అతడిని ఢీకొట్టాడు. ప్రమాదంలో రాజయ్య అక్కడికక్కడే మృతి చెందగా, దేవేందర్‌కు తీవ్రగాయాలు కావడంతో చికిత్స నిమిత్తం కర్నూలు ఆస్పత్రికి తరలించారు. రాజయ్య మృతదేహన్ని గద్వాల మార్చురీకి తరలించినట్లు పోలీసులు పేర్కొన్నారు.

'కురుమూర్తి'కి పోటెత్తిన భక్తజనం



కురుమూర్తి స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

చిన్నచింతకుంట: అమావాస్యను పురస్కరించుకొని శనివారం కురుమూర్తి స్వామి దర్శనానికి భక్తులు పోటెత్తారు. అర్చకులు ఆలయాన్ని శుద్ధిచేసిన తర్వాత సుప్రభాత సేవ నిర్వహించి.. భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఉదయం నుంచే ఉమ్మడి పాలమూరు జిల్లా నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. భక్తులు మెట్లపై దీపాలు వెలిగిస్తూ గోవింద నామస్మరణతో మార్మోగించారు. కొందరు మెట్టు మెట్టుకు కొబ్బరికాయ కొట్టి స్వామి చెంతకు చేరి దర్శించుకున్నారు. మరికొందరు భక్తులు తలనీలాలు సమర్పించారు. కొండ దిగువన మట్టికుండలో పచ్చిపులుసు అన్నం నైవేద్యంగా తయారుచేసి స్వామికి సమర్పించారు. అనంతరం కొండపై అలివేలు మంగమ్మ, చెన్నకేశవస్వామి, ఆంజనేయస్వామి, ఉద్దాల మండపాన్ని భక్తులు దర్శించుకున్నారు. జాతర మైదానంలో ఏర్పాటు చేసిన దుకాణాలు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ చైర్మన్ గోవర్ధన్ రెడ్డి, ఈఓ మదనేశ్వర్‌రెడ్డి, కమిటీ సభ్యులు బాదం వెంకటేశ్వర్లు ఏర్పాట్లను పర్యవేక్షించారు. హైదరాబాద్‌కు చెందిన బాయికాడి చెన్నప్ప, నామాల రమేష్, నామాల రాము, బుచ్చప్ప భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అలాగే చిన్నచింతకుంటకు చెందిన కటిక నరేందర్‌జీ, అంబాజీ బ్రదర్స్ భక్తులకు మంచినీరు, మజ్జిగ పాకెట్లు పంపిణీ చేశారు.

భక్తిశ్రద్ధలతో గిరి ప్రదక్షిణ..

కురుమూర్తి స్వామి ఆలయం వద్ద గిరి ప్రదక్షిణ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గణపతి, గీతాజ్ఞాన యజ్ఞకర్త మహర్షి సాదు మహారాజ్ శ్రీరఘోత్తమ ఆచార్యులతో కలిసి విశ్వహిందూ పరిషత్, బీజేపీ నాయకులు స్వామివారి రాజగోపురం వద్ద పూజలు నిర్వహించి గిరిప్రదక్షిణను ప్రారంభించారు. ప్రధాన ఆలయం పక్కనున్న కలశ పూజ మండపం నుంచి మట్టి రోడ్డుపై అమ్మపూరం గ్రామం మీదుగా 5 కి.మీ. గిరి ప్రదక్షిణ చేశారు. అనంతరం స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.



గిరిప్రదక్షిణ చేస్తున్న భక్తులు



క్యూలైన్‌లో ఇలా..



రాజగోపురం వద్ద దీపాలు వెలిగిస్తూ..

దారి దోపిడీ దొంగల అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రావుల గిరిధర్

- మూడు మొబైల్స్, రూ. 15వేల నగదు స్వాధీనం
- ఎస్పీ రావుల గిరిధర్ వెల్లడి

వనపర్తి: దారి దోపిడీలకు పాల్పడిన దొంగలను పోలీసులు పట్టుకుని అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను శనివారం ఎస్పీ రావుల గిరిధర్ వెల్లడించారు. జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రానికి చెందిన ఇర్ఫాన్ విజయవాడకు వెళ్లి రూ. 80వేలతో ఐ ఫోన్ కొనుగోలు చేశాడు. విజయవాడ రైల్వే స్టేషన్‌లో పోలీసులు తనిఖీలు చేస్తుండగా.. అనుమానంతో ఇర్ఫాన్‌ను పట్టుకుని అతడి వద్ద ఉన్న ఐ ఫోన్‌ను స్వాధీనం తీసుకున్నారు. ఇంత ఖరీదైన ఫోన్ ఎక్కడిదంటూ ఆరా తీసిన రైల్వే పోలీసులు.. ఇర్ఫాన్ అన్న అబ్దుల్‌కు ఫోన్‌చేసి సమాచారం అందించారు. ఇర్ఫాన్‌ను తీసుకువచ్చేందుకు గద్వాల నుంచి ఓ కారును అద్దెకు తీసుకుని అబ్దుల్, అతడి సోదరుడు షేక్ హైమద్, వారి స్నేహితుడు రామాంజనేయులు విజయవాడకు వెళ్లారు. అక్కడ రైల్వే పోలీసులతో మాట్లాడి ఇర్ఫాన్, ఐ ఫోన్ తీసుకుని కోదాడలో గల బంధువుల ఇంటికి వెళ్లారు. అక్కడ ఇర్ఫాన్‌ను వదిలేసి.. కారు డ్రైవర్ షేక్ అహ్మద్, అబ్దుల్, షేక్ హైమద్, రామాంజనేయులు నలుగురు కలిసి గద్వాలకు బయలుదేరారు. కారులో ఖరీదైన ఫోన్, అబ్దుల్ వద్ద ఉన్న నగదు కొట్టేయాలనే దుర్బుద్ధితో రామాంజనేయులు తన మామ అయిన గోపాల్‌పేట మండలం బుద్దారం గ్రామానికి చెందిన పొడుగు రాజేశ్‌కు ఫోన్ ద్వారా దోపిడీ చేయాలని పథకం రచించాడు. కారులో వస్తున్న సమయంలో దారి వివరాలను ఎప్పటికప్పుడు తెలియజేశాడు. ఈ నెల 27న తెల్లవారుజామున బుద్దారం సమీపంలోకి రాగానే పొడుగు రాజేష్‌తో పాటు విజయ్‌కుమార్, మహ్మద్ సల్మాన్, చెన్నూర్ అశోక్ రోడ్డుకు అడ్డంగా స్కూటీని ఆపడంతో డ్రైవర్ కారును ఆపేశాడు. అంతే ఒక్కసారిగా దాడికి పాల్పడ్డారు. అనంతరం ఐ ఫోన్‌తో పాటు అబ్దుల్ వద్ద ఉన్న రూ.15వేల నగదు దోచుకున్నారు. అనుమానం రాకుండా ఉండేందుకు రామాంజనేయులు ఫోన్‌తో పాటు షేక్ అహ్మద్, అబ్దుల్ ఫోన్లను లాక్కొని వెళ్లిపోయారు. దారి దోపిడీపై గోపాల్‌పేట పోలీస్‌స్టేషన్‌లో షేక్ అహ్మద్ ఫిర్యాదు మేరకుకేసు నమోదు చేసిన ఎస్ఐ నరేష్‌కుమార్.. విచారణ మొదలుపెట్టి కేసును ఛేదించారు. రామాంజనేయులును అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారించగా.. నేరం ఒప్పుకున్నాడు. నేరస్తుల నుంచి మూడు సెల్‌ఫోన్స్, నగదును స్వాధీనం చేసుకున్నట్టు ఎస్పీ తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

కొత్తకోట రూరల్: మండలంలోని కానాయపల్లిలో ఆత్మహత్యకు పాల్పడిన ఓ మహిళ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ ఆనంద్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. మండలంలోని నాచారం పేటకు చెందిన రాణి (33)కి 15 ఏళ్ల కిందట పెద్దమందడి మండలం మోజర్లకు చెందిన నెల్లి కృష్ణయ్యతో వివాహం జరిగింది. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. రెండేళ్ల కిందట జరిగిన రోడ్డు ప్రమాదంలో కృష్ణయ్య మృతిచెందగా పిల్లల చదువుల నిమిత్తం రాణి గ్రామంలో ఉన్న ఇంటిని విక్రయించి కానాయపల్లి స్టేజీ సమీపంలో ఓ ఇంటిని అద్దెకు తీసుకొని ఉంటోంది. రాణికి దూరపు బంధువైన బోయ బాలు మాయ మాటలు చెప్పి ఈ నెల 15న వివాహం చేసుకొని వ్యాపారం కోసం డబ్బులు కావాలంటూ వెంటపడగా ఇద్దరి మధ్య గొడవ జరిగింది. మానసిక ఒత్తిడికి గురైన లలితమ్మ జీవితంపై విరక్తి చెంది ఈ నెల 26న సూపర్ వాస్మాల్ తాగి ఆత్మహత్యకు పాల్పడింది. గుర్తించిన స్థానికులు వనపర్తి ఏరియా ఆస్పత్రికి, అక్కడి నుంచి మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఈ నెల 27న మృతిచెందింది. మృతురాలి అక్క లలితమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు.

కూడలిలో కారు బీభత్సం

- ఇద్దరికి తీవ్రగాయాలు
- పూర్తిగా ధ్వంసమైన ఐదు బైక్‌లు

ఎర్రవల్లి: మండల కేంద్రంలోని హైవే కూడలిలో శనివారం రాత్రి ఓ కారు బీభత్సం సృష్టించింది. కూడలిలో రోడ్డు పక్కన ఆగి ఉన్న ద్విచక్ర వాహనాలతో పాటు పాదచారులపైకి అతివేగంతో దూసుకెళ్లింది. ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు కాగా ఐదు బైక్‌లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఇటిక్యాల ఎస్ఐ వెంకటేష్, స్థానికులు తెలిపిన వివరాలు.. మండల పరిధిలోని కొండేరుకు చెందిన ఈడిగ మద్దిలేటి ఏపీ09 ఏజే0284 నంబర్ గల కారులో పెబ్బేరు నుంచి తన స్వగ్రామానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఎర్రవల్లి కూడలిలోకి రాగానే కారు అతివేగంతో తోలడంతో రోడ్డు పక్కనున్న ద్విచక్ర వాహనాలతో పాటు ఆటోను ఢీకొట్టింది. ప్రమాదంలో కొండేరుకు చెందిన హనుమంతు, బొచ్చు వెంగనపల్లికి చెందిన కృష్ణకు తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వారిని హైవే అంబులెన్స్‌లో కర్నూల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రమాదంలో ఓ ఎలక్ట్రిక్ బైక్‌తో పాటు మరో నాలుగు బైక్ పూర్తిగా ధ్వంసమయ్యాయి. స్థానిక పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదానికి కారణమైన కారుతో పాటు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ పేర్కొన్నారు. పండుగ పూట ఇలాంటి ఘటన జరగడంతో కూడలిలో ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు.



ప్రమాదానికి కారణమైన కారు

యువకుడి బలవన్మరణం

గద్వాల క్రైం: జిల్లాకేంద్రానికి చెందిన శివ (24) శనివారం ఉదయం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు స్థానికులు తెలిపారు. కుటుంబ సభ్యులు గుర్తించి కాపాడే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. బలవన్మరణానికి ఆర్థిక సమస్యలే కారణంగా తెలుస్తోంది.

నెమలి మృతి

తిమ్మాజిపేట: మండలంలోని అప్పాజిపల్లి సమీపంలో శుక్రవారం రాత్రి నెమలి మృతిచెందింది. గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామానికి చుట్టపుచూపుగా వచ్చిన ఇద్దరు వ్యక్తులు అల్లంపల్లి శివారులో కుందేళ్లకు వల వేయగా నెమలి చిక్కుకుంది. గుర్తించిన కొందరు రైతులు అక్కడికి వెళ్లే సరికి వారు వదిలి పారిపోయారు. నెమలిని పరిశీలించగా అప్పటికే మృతిచెందింది.